క్లుప్తంగా...

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 23, గుండుబీన్స్ 80, గింజ చిక్కుడు 70, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 13, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 29, ఆలుగడ్డ 21, చామగడ్డ 40, మొరంగడ్డ 33, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

సమస్యల పరిష్కారానికి వినతి


వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

లాలాపేట: ఇటీవల నూతనంగా ఎన్నికైన వినోభానగర్ కాలనీ నవోదయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదివారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. బస్తీలో నెలకొన్న మురుగు నీటి సమస్య, రోడ్ల ప్యాచ్ వర్క్స్, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో అధ్యక్షులు రామకృష్ణ, కోశాధికారి వెంకటచారి, వరప్రసాద్, శ్రీనివాస్, సిద్ధిరామం, హరికృష్ణ, జ్ఞానేశ్వర్, సీహెచ్ వెంకటాచారి ఉన్నారు.

కుట్టు మెషిన్ల అందజేత


కుట్టు మెషిన్లు అందజేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: అన్ని వర్గాలకు చెందిన వారికి ఉపకరించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెడుతుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో మైనారిటీ మహిళలకు 'కేసీఆర్ కా తోఫా' పేరిట కుట్టు మెషిన్లు కానుకగా అందించే పథకాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న కుట్టు మిషిన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు డివిజన్లకు చెందిన 200 మంది ముస్లిం మహిళలకు కుట్టు మెషిన్లు అందజేసినట్లు తెలిపారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, బీఆర్ఎస్ నేతలు కిషోర్ గౌడ్, రామేశ్వర్‌లతో పాటు మైనారిటీ నేతలు, ప్రత్యేకాధికారి జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు తరచూ వైద్య పరీక్షలు చేయించాలి



కంటోన్మెంట్: చిన్నారులు రోగాల బారిన పడకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని బీజేపీ నాయకురాలు సుష్మిత శంకర్రావు అన్నారు. కంటోన్మెంట్ మోండా డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో ఆమె ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుష్మిత మాట్లాడుతూ.. తాను ఇటీవల బస్తీలో పర్యటించిన సందర్భంగా ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న వైరల్ ఫీవర్ పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశానన్నారు. త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా పలు బస్తీల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక నరేశ్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో వీరవర్ధన్ గౌడ్, నందుల చిన్న వీరయ్య, శ్రీనివాస్, బాలమల్లేశ్ యాదవ్, నాగేష్, వెంకటేశ్, శివకుమార్, లోకేశ్ పాల్గొన్నారు.

లష్కర్ ఓటర్లు @ 256555



- ఎన్నికల ప్రక్రియ పూర్తి
- సమర్థవంతంగా ఓటర్ల జాబితా
- పకడ్బందీ నిర్వహణకు అధికారులు ప్రణాళికలు


బౌద్ధనగర్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు (ఫైల్)

సికింద్రాబాద్: ఎన్నికల ప్రకటన ఎప్పుడు వెలువడినా సమర్థవంతంగా ప్రక్రియ నిర్వహించేందుకు సికింద్రాబాద్‌లో ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఓటరు జాబితా మొదలు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు వరకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. బూత్ లెవల్ ఆఫీసర్లు, పర్యవేక్షకులు, ఎన్నికల అధికారుల వరకు క్షేత్రస్థాయి పర్యటనలు, కసరత్తుల ఫలితంగా ఎన్నికల ప్రణాళిక సిద్ధమైంది. 256555 మందితో ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రకటించిన అధికారులు 220 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసుకుంటున్నారు.

7000 దరఖాస్తులు..

2018 అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాతో పోల్చితే ఈ మారు 22,765 ఓటర్లు పెరిగారు. సెప్టెంబర్ నెలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల ఫలితంగా కొత్త ఓటర్ల నుంచి భారీగా స్పందన లభించింది. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు 7000 దరఖాస్తులు అందాయి. సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్.ఎల్లారెడ్డి, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.సుధాంశ్ నేతత్వంలో విచారణ జరిపిన అధికారులు కేవలం 91 దరఖాస్తులను మాత్రమే తిరస్కరించి మిగతా వారి పేర్లు జాబితాలో చేర్చారు.

కేంద్రాల బదలాయింపు..

గత శాసనసభ ఎన్నికల తరహా ఈసారి కూడా ఎంపిక చేసిన 105 భవనాల్లో 220 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఎంపిక చేసుకున్న కేంద్రాల్లో మౌలిక సదుపాయాల తీరుతెన్నుల గురించి పరిశీలనలు చేస్తున్నారు. సాంకేతిక కారణాల వల్ల 11 పోలింగ్ బూత్‌లను వేరే భవనాల్లోకి బదలాయించారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఆరు పోలింగ్ బూత్‌లను ఎదురుగా ఉన్న మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్‌లోకి మార్చారు. మరో రెండు పోలింగ్ కేంద్రాలను నామాలగుండులోని మున్సిపల్ వార్డు కార్యాలయంలోకి మార్చారు. ఐదవ డివిజన్‌లోని కిందిబస్తీలోని ఒక పోలింగ్ కేంద్రాన్ని సమీపంలోని విద్యావిహార్ పాఠశాలకు మార్చారు.

1100 అధికారులు, సిబ్బందితో..

బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్‌లోని 2 కేంద్రాలను సమీపంలోని బాలాజీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల భవనాల్లోకి తరలించారు. తాజాగా ఏడు వేల ఓటర్లు పెరిగిన క్రమంలో మరో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎన్నికల ప్రకటన వెలువడమే తరువాయి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఇతర ఎన్నికల సిబ్బందిని నియమించి శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఇప్పటి నుంచే సుమాలోచనలు చేస్తున్నారు. 11 వందల మంది అధికారులు, సిబ్బందిని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు చేయాలని నిర్ణయించారు. కొత్త ఓటర్లను జాబితాలో చేర్పించే ప్రక్రియలో వంద శాతం సత్ఫలితాలు సాధించామని సికింద్రాబాద్ ఎన్నికల అధికారి ఎస్.సుధాంశ్ తెలిపారు. ఓటర్ల జాబితా రూపొందించిన మాదిరి పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో కూడా పకడ్బందీ జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పోలింగ్ కేంద్రాల విషయంలో ప్రజలు తమకు సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

పెరిగిన ఓటర్ల తీరు

	2018	2023
పురుషులు:	1,18,993	1,29,144
స్త్రీలు:	1,14,774	1,27,392
ఇతరులు:	23	19
మొత్తం:	2,33,790	2,56.555

పేదల సంక్షేమానికి పెద్దపీట


స్థానిక మహిళ సమస్య వింటున్న లాస్యనందిత

రసూల్‌పురా: పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారి అభివృద్ధికి పథకాలిచ్చే సీఎం కేసీఆర్ నాయకత్వంలోని కారుగుర్తుకు ఓటేసి మరోసారి గెలిపించాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత పేర్కొన్నారు. ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారంలో నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన అంబేడ్కర్ యువజన సంఘం కమ్యూనిటీహాల్‌ను ఆదివారం ఆమె బోర్డు మాజీ సభ్యులు జే.లోక్‌నాథ్, స్థానిక నేతలతో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ.. తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న పేదల సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడ్డారని గుర్తు చేశారు. పేదలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు కోట్లాది రూపాయలను వెచ్చించి కమ్యూనిటీహాళ్లు, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లను నిర్మించారన్నారు. అనంతరం బొల్లారంలోని రజక సంఘం, తోటి సంఘం, ఆదర్శనగర్, పెన్షన్‌పుర తదితర బస్తీల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు వచ్చే ఎన్నికల్లో లాస్యనందితకు పూర్తి మద్దతిచ్చి గెలిపిస్తామని హామీ ఇచ్చారు. గతంలో సాయన్న వెంట ఉన్నట్లుగానే ఈ సారి కూడా సాయన్న కుమార్తె లాస్య వెంట ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు నళినికిరణ్, మార్కెట్ మాజీ చైర్మన్ ఖదీరవన్, మురళియాదవ్, తోటి సంఘం, రజకసంఘం, అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు అశోక్ ఉమేష్, ఉదయ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ

లాలాపేట: ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని శాంతినగర్‌లోని తక్షశిలా హైస్కూల్ విద్యార్థులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పొడవునా పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను తెలిపే ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కూల్ ఆవరణ, పరిసరాలతో పాటు కాలనీ రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాలోని తాండూర్ గ్రామానికి చెందిన ముద్దపురం లక్ష్మయ్య(61) వృత్తిరిత్యా కూలీ. ఈ నెల 8న ఉదయం బొల్లారం బజార్ రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

గ్రంథాలయాలకు పూర్వవైభవం కల్పిస్తాం


గ్రంథాయం నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్న దర్గా దయాకర్ రెడ్డి

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో గ్రంథాలయాలకు పూర్వవైభవం కల్పిస్తామని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి అన్నారు. రూ.4.5 కోట్ల వ్యయంతో కంటోన్మెంట్ పరిధిలోని బోయిన్‌పల్లి, తిరుమలగిరి, బొల్లారం ప్రాంతాల్లో మూడు నూతన గ్రంథాలయ భవనాలను నిర్మించనున్నట్లు వెల్లడించారు. సోమవారం ఆయా భవనాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం ప్రతిపాదిత భవన నిర్మాణ స్థలాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలం నుంచి కంటోన్మెంట్‌లో కొనసాగుతున్న గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరాయని కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా కూలిపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. మూడు ప్రాంతాల్లో నూతన గ్రంథాలయ భవనాల నిర్మాణం కోసం స్థలం కేటాయించాల్సిందిగా కంటోన్మెంట్ అధికారులను కోరగా మూడు చోట్ల 500 గజాల చొప్పున స్థలాన్ని కేటాయించడంతో భవన నిర్మాణాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లోని అన్ని కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఆరోవార్డు బీహెచ్ఈఎల్ ఎన్‌క్లేవ్‌లో రూ.29 లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు బీజేపీ నేతలు బానుక మల్లికార్జున్, బానాల శ్రీనివాస్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని అయినా అందుబాటులో ఉన్న నిధులతో దశల వారీగా అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కంటోన్మెంట్‌కు జరుగుతున్న అన్యాయంపై స్థానిక ప్రజలంతా కలిసి సమష్టిగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో రవీందర్, రవి, సోమేశ్వర్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సూర్య శ్రీనివాస్, విద్యాసాగర్, రాజారావు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో దాండియా జోష్

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలో దాండియా జోష్ మొదలైంది. మల్లారెడ్డి గార్డెన్స్‌లో ఈ నెల 15 నుంచి తొమ్మిది రోజుల పాటు 'ఎస్‌కే నవరాత్రి ఉత్సవ్-2023' పేరిట మెగా ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం మల్లారెడ్డి గార్డెన్స్‌లో టికెట్ లాంచింగ్ ఏర్పాటు చేశారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్, కార్పొరేటర్ సామల హేమ ముఖ్య అతిథులుగా హాజరై దాండియా ఉత్సవాలను ప్రారంభించారు. ప్రతీ రోజూ రాత్రి 7.00 గంటలకు ప్రారంభమై, అర్ధరాత్రి వరకు వేడుకలు కొనసాగుతాయని నిర్వాహకులు శ్రీకాంత్ వెల్లడించారు. రూ.1,499 చెల్లించి తొమ్మిదిరోజుల సీజన్ పాస్ పొందిన వారికి మొదటి ఐదు రోజుల పాటు రాత్రి డిన్నర్ కూడా అందించనున్నట్లు తెలిపారు. డే పాస్ రూ.399 ఉంటుందని, పాస్‌ల కోసం బుక్ మై షో, పేటీఎం ఇన్‌సైడర్, ఆల్‌ఈవెంట్స్.ఇన్ లేదా 7330655466 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు. వేడుకలకు హాజరయ్యే వారు సాంప్రదాయ దాండియా దుస్తులు ధరించాలని సూచించారు.


దాండియా ఉత్సవాలను ప్రారంభించిన నిర్వాహకులు

ఎమ్మెల్యే సీట్లకు విద్యార్థి జేఏసీ నేతల వినతి


కిషన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమ విద్యార్థులకు పది సీట్లు కేటాయించాలని జేఏసీ నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. విద్యార్థి ఉద్యమకారులకు రాజకీయంగా అన్ని పార్టీలు తగిన ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ రుద్రవరం లింగస్వామి, దరువు ఎల్లన్న, పూసల రమేష్, పాపారావు, గాదె వెంకట్, లెనిన్, శేషు కోరారు.

ప్రజల మధ్య ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్

బన్సీలాల్‌పేట్: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బర్కల్‌బస్తీలో ఆదివారం నూతన సీవరేజ్ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ కె. హేమలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల మధ్యలో ఉంటూ వారి సూచించిన సమస్యలు, సాధక బాధలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. బర్కల్‌బస్తీలో అనేక సమస్యలను పరిష్కరించినట్లు గుర్తు చేశారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో అర్హులైన పేదలకు దళిత బంధువు, గృహలక్ష్మీ వంటి పథకాలతో ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేయడంతో పాటు కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, సీజీఎం ప్రభు, శశాంక్, తహసీల్దార్ పాండు నాయక్, స్థానిక నాయకులు నరేష్, వెంకటేషన్, ప్రేమ్, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వచ్చాకే సనత్‌నగర్ అభివృద్ధి..

అమీర్‌పేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాతనే సనత్‌నగర్ నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట డివిజన్ లీలానగర్‌లో ఆదివారం ఆయన పర్యటిస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సన్‌రైజ్ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరగా త్వరలోనే చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. వేరే ప్రాంతానికి చెందిన వారు తమ కార్లను ఇక్కడ పార్కు చేస్తున్నారని, అపరిచితులు రాత్రి వేళల్లో తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేయగా ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులకు సూచించారు. అనంతరం ఇంపీరియల్ ప్రిస్టిజియస్ అపార్ట్‌మెంట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. 2014 ముందు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేని కారణంగా మురుగునీరు రోడ్లపై ప్రవహించేదని తన హయాంలో డ్రైనేజీ, రోడ్లను ఏర్పాటు చేసి సమస్యను పూర్తిగా పరిష్కరించామన్నారు. ఈ ప్రాంతం నుంచి గెలిచి ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి సైతం ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని సీఎం కేసీఆర్ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అధికారులు హరిశంకర్, మోహన్, వంశీ, మురళి, శ్రీనివాస్, కాలనీ అధ్యక్షులు మహేశ్వరి స్వరూప్,వినీత్ మహేశ్వర్,ఉత్తమ్ సింగ్, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.

సారూ.. మా సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లరూ!



గాంధీఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించేందుకు ఆదివారం వచ్చిన హోంమంత్రికి గాంధీ కాంట్రాక్టు నర్సులు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. స్పందించిన మంత్రి ఈ విషయమై సీఎం కేసీఆర్, వైద్యశాఖ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాంట్రాక్టు నర్సుల విధుల బహిష్కరించి చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరింది. అనంతరం గాంధీ సూపరింటెండెంట్ రాజారావుతో ఇదే అంశంపై చర్చించారు. -గాంధీఆస్పత్రి

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి


మాట్లాడుతున్న కాశీం

ఉస్మానియా యూనివర్సిటీ: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రొ.సూరజ్ మండల్ (బీపీ మండల్ మనుమడు) అన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్లో చట్టసభల్లో (శాసన మండలి, అసెంబ్లీ, పార్లమెంట్) బీసీలకు రిజర్వేషన్లు అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఓయూ అధ్యాపకులు కాశీం అధ్యక్షత నిర్వహించగా ప్రొ.సురజ్‌మండల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు చట్టసభలో వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల ద్వారానే సామాజిక న్యాయం జరిగి అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతారన్నారు. ఈ సమావేశంలో ప్రొ.ప్రభంజన్ యాదవ్, వంగ బీఎస్పీ రాష్ట్ర నాయకుడు కంచర్ల భద్రీ, రాములుగౌడ్, నరేందర్‌గౌడ్, నాగేష్ముదిరాజ్, రమణ, స్వరూప పాల్గొన్నారు.




ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి


ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

అడ్డగుట్ట: ప్రజా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. ఆదివారం అడ్డగుట్టలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులతో పాటు డివిజన్ పరిధిలో రూ. 18 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన చిరకాల స్వప్నమైన అడ్డగుట్టలో ఆస్పత్రి నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రాన్ని పూర్తిగా తొలగించి దాని స్థానంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ స్రవంతి, జీహెచ్ఎంసీ ఏఈ వేణు, ఎస్‌పీహెచ్ఓ రాజశ్రీ, నేతలు లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, మధుగౌడ్, నక్క మధు, మనోహర్, సత్తయ్యగౌడ్, మహ్మద్, ఇస్మాయిల్, గౌస్, దేవయ్య పాల్గొన్నారు.

నిలదీసిన శాస్త్రీనగర్ వాసులు..

వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం అడ్డగుట్టకు వచ్చిన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను శాస్త్రీనగర్ బస్తీలోని పలువురు మహిళలు నిలదీశారు. తమ బస్తీలో అర్హులైన వారెవ్వరికీ కూడా డబుల్ బెడ్రూమ్‌లు, బీసీ బంధు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్తీలో సమస్యలు కూడా పరిష్కారం కాలేదని స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ తమ బస్తీలో సమస్యలు తెలుసుకునేందుకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.


ప్రభుత్వ పథకాలు తమకు రాలేవని నిలదీస్తున్న మహిళలు

కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ స్థానికులకే కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జైప్రకాష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా స్థానికులనే ప్రకటించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జైప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారం రీడింగ్‌రూమ్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బయటి వ్యక్తులకు టికెట్ కేటాయించడంతో నియోజకవర్గానికి చెందిన నాయకులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎన్నికల సమయంలో వచ్చే ప్యారషూట్ నాయకులకు స్థానిక ప్రజలతో, పార్టీ కార్యకర్తలతో సత్సంబంధాలు లేకపోవడంతో ఓటమిని చవిచూస్తున్నారన్నారు. కంటోన్మెంట్‌లో అర్హులైన నాయకులు తనతో పాటు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మనోజ్, వినోద్, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాకేష్,రాజు, పీటర్ పాల్గొన్నారు.

ట్రైబల్ యూనివర్సిటీలో విద్య,ఉపాధి అవకాశాలు కల్పించాలి


ఐక్యత ప్రదర్శిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ములుగులో త్వరలో ఏర్పాటు చేయనున్న ట్రైబల్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్య, ఉపాధి అవకాశాలు 80 శాతం గిరిజనులకే కల్పించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో గిరిజన శక్తి ఆధ్వర్యంలో ట్రైబల్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. ఈ క్రమానికి గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ అధ్యక్షత వహించగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నవంబర్ రెండో వారంలో సరూర్‌నగర్ స్టేడియంలో లంబాడీల సింహాగర్జన మహాసభను నిర్వహించనున్నట్లు శరత్‌నాయక్ తెలిపారు. అనంతరం 34 అంశాలతో గిరిజన డిక్లరేషన్‌ను విడుదల చేశారు. గిరిజనులు ఎక్కువ శాతం ఉన్న జనరల్ ఎమ్మెల్యే సీట్లలో 10 సీట్లను ఎస్టీలకు కేటాయించాలి, జీవో నంబర్-3ను పునరుద్ధరించాలి, ట్రైబల్ వర్సిటీలో 80 శాతం ఉద్యోగాలు, సేవలాల్ మహారాజ్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి, ఎస్టీ కమిషన్ ఏర్పాటు, పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి తదితర అంశాలను డిక్లరేషన్‌లో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి నాయకులు సుబ్బునాయక్, రాజునాయక్, విజయ్ నాయక్, సిద్ధార్థ్‌నాయక్, ఓయూ నేతలు హనుమంత్‌నాయక్, నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379